

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**"ఆహా. ఎన్ని** రోజులైందో ఇంత మంచి లంచ్ తిని. అన్నదాతా సుఖీభవా" అన్నయ్య నవ్వించాడు.

నేను ఆవులించడం చూసి "నిద్రపోకు. రోజూ ఇలా అయితే కష్టం. ఒక రెండు రోజులు కష్టపడితేచాలు అలవాటైపోతుంది" అన్నయ్య చెప్పాడు.

"సరే కిచెన్ సర్దుతా" అంటూ లేస్తుండగా

"మరీ అంత రాక్షసుడ్నికాదు. వంట నువ్వు చేసావు కాబట్టి నేను సర్దుతాలే" అన్నయ్య అంటుండగా నేను మళ్ళీ ఆవులించాను.

నేను నిద్రలోకి జారుకోకుండా కాపలా కాస్తున్నట్టు "నీ ఫ్రెండ్స్ ఏం చేస్తున్నారు ఇప్పుడు?" అడిగాడు.

"ఏ ఫ్రెండ్స్? మోనికా వాళ్ళా? వైషు వాళ్ళా?"

"నాకేం తెల్సే? నేను ఇండియాకి వచ్చినప్పుడు నువు రోజూ సాయంత్రాలు పానీపూరీ తిండానికి నన్ను వదిలేసి వెళ్ళేదానివి కదా, ఆ ఫ్రెండ్స్" ఎగతాళిగా అడిగాడు.

"ఓ. వాళ్ళా. వరుణ్ సిఏకి ప్రిపేర్ అవుతున్నాడు. రాంకి జాబ్ వచ్చింది. హరిత పెళ్ళి చేసుకుంటుందట. నిఖిత నెక్స్ట్ సెమిస్టర్‌కి యూ.ఎస్ వస్తుందట."

"నీ ఫ్రెండ్స్‌లో ఎవరూ మాస్టర్స్‌కి రాలేదా అయితే?"

"నా కాలేజ్ క్లాస్ మేట్స్ కొంతమంది వచ్చారు. ఒకళ్ళు యూనివర్సిటీ ఆఫ్ టెక్సస్ ఎ&ఎం, ఇద్దరు ఫ్లోరిడా, ఒకళ్ళు ఎన్.జె.ఐ.టి. మిగిలినవాళ్ళు గుర్తులేదు."

"అందరూ అనుకుని ఒకే యూనివర్సిటీకి వెళ్ళాలనుకోలేదా?"

"అహ. లేదు వాళ్ళు మరీ అంత క్లోజ్ కాదు నాకు."

"ఓ..ఓకే"

సంభాషణ పూర్తయ్యాక మళ్ళీ ఆవులించడం గమనించి, "షాప్ కెళ్దామా?" అడిగాడు.

"యా. వెళ్దాం. డ్రెస్ ఛేంజ్ చేసుకొస్తా"

"ఒసేయ్. నువ్వేం తెలుగు సినిమా హీరోయిన్‌వి కాదు ప్రతి సీన్‌కి డ్రస్ ఛేంజ్ అనడానికి"

"అమ్మ బయటికి వెళ్ళేప్పుడు మంచివి వేసుకోమంది."

"ఇప్పుడు నువ్వు వేసుకుంది మంచిగానే ఉందిలే. చెప్పులేసుకో"

ఈసారి గుర్తుపెట్టుకుని డ్రైవర్ సీట్ డోర్ కాక కరెక్ట్ తలుపు తెరిచి అన్నయ్య మెచ్చుకుంటాడేమో అని ఎదురు చూసాను.

"నవ్వుతున్నావేంటి?" అడిగాడు.

"ఏం లేదు" నిశ్శబ్దంగా నిద్రాపుకుంటూ కూర్చున్నాను.

కారు దిగి వాల్‌మార్ట్ లోపలికి నడిచాము.

"ఫస్ట్ బేసిక్స్‌తో స్టార్ట్ చేద్దాం. పొద్దున లేచినప్పటినుంచి నీకు ఏం అవసరం?"

"ఆం.. లేచాక బ్రష్ చేసుకోవాలి."

"రైట్. ట్రావెల్ సైజ్ టూత్ బ్రష్, టూత్ పేస్ట్, సోప్, షాంపూ, ఫేస్ వాష్." అంటూ అన్నీ టకటకా కార్ట్‌లో పడేసి గబగబా నడిచాడు.

"ఈ ప్రొటీన్ బార్స్ రెండు బాక్సెస్ కొంటాను. నీతోపాటు తీసుకెళ్ళి టెంపరరీ అకామడేషన్‌లో ఉన్నప్పుడు తిను. వాళ్ళవేవీ మరీ అవసరమైతేగానీ వాడకు" అని కార్ట్‌లో పెట్టాడు.

అలా ముఖ్యమైనవి తీసుకున్నాక "ఇంకేమైనా మర్చిపోతున్నానా?" అడిగాడు.

"లేదు. అన్నీ తీసుకున్నాము" చెప్పాను.

"సరే. ఇప్పుడు ఇంట్లోకి కావల్సినవి తీసుకుందాం. మొహమాటపడకు"

"అలాగే" అంటూ అన్నయ్య వెంట నడిచాను.

"పాలు, పెరుగు కావాలా?" అడిగాడు.

"యా. కావాలి"

"రైట్ సైడ్ ఉన్నాయి చూడు. నేను ఈ లోపల ఎగ్స్ తీసుకుంటా"

రైట్ సైడ్ చూసాను. బటర్ మిల్క్, సోయా మిల్క్, ఆల్మండ్ మిల్క్, కోకొనట్ మిల్క్ అక్కర్లేదని తీర్మానించాను. విటమిన్ డి మిల్క్, హోల్ మిల్క్, లో ఫేట్ మిల్క్‌లో ఒకటి కావాలి. అలవాటైన హోల్ మిల్క్‌ని తీసుకుని కార్ట్‌లో పెట్టాను. నా బుర్రలో ఒక

నిమిషం పాటు పాలగురించి జరిగిన చర్చ వాస్తవంలో పదినిమిషాలు జరిగిందని అన్నయ్య కసురుకుని "పెరుగుకి ఇంకెంతసేపు చేస్తావో" అంటూ "ఇది తీసుకో" అన్నాడు.

అన్నయ్య జింజర్ ఏల్ తీసుకుంటుండగా అక్కడ ఉన్న రకరకాల కోక్ సీసాలు చూసాను. కోక్‌లో రెగ్యులర్, డైట్ కాక ఇన్ని ఫ్లేవర్స్ ఉంటాయని నాకు తెలియదు.

"బ్రేక్‌ఫాస్ట్‌కి ఓట్స్ తింటావా?" అడిగాడు అన్నయ్య.

"యా. తింటాను" బదులిచ్చాను.

"పాలలాగే గంటసేపు చేస్తావా? లేక తొందరగా ఒక ఫ్లేవర్ తీసుకుంటావా?"

"ఏదైనా పర్లేదు. నువ్వే తీసుకో" అన్నాను.

ఫ్రోజెన్ సెక్షన్‌లో కూడా నాకు కావల్సినవి తీసుకోమనడంతో బోల్డు ఐస్క్రీంలు, విప్డ్ క్రీం, మొదలైనవి కార్ట్‌లో పెట్టాను. అన్నీ ఇంటికి తీసుకెళ్ళి ఇద్దరం కలిసి ఫ్రిడ్జ్‌లో ఇరికిచ్చాం. సర్దుతున్నంతసేపు "ఇన్ని ఐస్క్రీమ్స్ ఏంటి? ఇంత షుగరా? దానికి తోడు విప్డ్ క్రీం కూడానా? ఇంత తింటే బోండాంలా తయారవుతావు" అంటూనే ఉన్నాడు. నిజానికి అన్నయ్య మాటలు నన్ను కదిలించలేదు. ఆ మాట చెపితే దున్నపోతు మీద ఈగలాంటి సామెత ఏదోటి చెప్తాడని "సారీ. సరే ఇంక చెయ్యను" అంటూ ఉన్నాను.

నిద్రమళ్ళీ మొదలైంది.

"ఇంకో టు అవర్స్ ఆగు. ఆ తరవాత డిన్నర్ చేసి పడుకో. ఇంక లేపను రేపటివరకు" అన్నాడు.

సరే అన్నట్టు తలాడించాను.

"నీ ఫేస్‌బుక్‌లో మన కజిన్స్ అందరూ ఉన్నారా?"

"యా. చాలావరకు అందరూ ఉన్నారు."

"టైం ఉన్నప్పుడు ఒకసారి ఇవ్వు. ఏం చేస్తున్నారో ఒకసారి చూస్తా"

"నీ దాంట్లో లేరా?"

"లేరు. వాళ్ళంతా దిష్టిపెట్టే బేచ్ అని డిలీట్ చేసాను. అయితే దిష్టి. లేకపోతే రూమర్స్"

"పాస్ వర్డ్ ఏంటి నీ కంప్యూటర్‌కి?"

"అదేంటి? నీ లేప్‌టాప్ లేదా?"

"అమ్మ తీసుకుంది. ఇక్కడ నీతో మంచిది కొనిపించుకోమంది"

"ఓ.. కరెక్టేలే. నీకు మంచిది అవసరం. రేపు ఫోన్‌తోపాటు లేప్ టాప్ కూడా కొందాం" అంటూ కంప్యూటర్‌లో సైన్ ఇన్ అయ్యాడు. నేను ఫేస్‌బుక్‌లో లాగిన్ అయ్యాక, "అదేంటి? వీళ్ళతో కూడా నువు ఫ్రెండ్‌వా? వాళ్ళుకూడా ఉన్నారే నా ఫేస్‌బుక్‌లో.. అబ్బో, అందరినీ ఏడ్ చేసుకున్నట్టు ఉన్నారే" అంటూ నా ఫ్రెండ్స్ లిస్ట్‌ని చూసాడు.

"ఇంతకి జ్యోత్స్న ఇప్పుడేం చేస్తుంది?" బాబాయ్ కూతురి గురించి అడిగాడు.

"ఎంసెట్ లాంగ్ టర్మ్ తీసుకుంది కానీ మెడిసిన్‌లో సీట్ రాలేదు. బాబాయ్ పేమెంట్ సీట్ కొందాం అనుకున్నాడట కానీ పిన్ని వద్దంది"

"మంచిదే, లాంగ్ టర్మ్ తీసుకున్నా సీట్ రాలేదంటే మెడిసిన్ ఇంకా కష్టం. ఒక్క బేక్‌లాగ్ ఉన్న ఇయర్ రిపీట్ చెయ్యాలి"

"అమ్మకూడా అదే అంది. ఇప్పుడు బి.ఎస్.సి చేస్తుంది."

"బి.ఎస్.సినా? మెడిసిన్‌కి పేమెంట్ కట్టడానికి రెడీ అయినప్పుడు ఫార్మసీలాంటి వాట్లో చేర్పించొచ్చుకదా?"

"ఏమో? తనుకూడా వెంటనే ఒప్పుకుంది"

"వాళ్ళ అన్నయ్య ఇప్పుడు ఐఏఎస్సా? ఐపీఎస్సా?"

"అదేంటి? నీకు తెలుసుగా? ఇంజినియర్"

"ఔనే. కానీ మనమందరం తనకి "ఆఫ్టర్ ఆల్" కదా. ఏం సాధించాడో అని అడుగుతున్నా"

"ఏవో చాలా జాబ్ ఆఫర్స్ వచ్చాయట. కానీ అవి తనకి సరిపోవని తీస్కోలేదట."

"అబ్బో. ఇంకెన్ని పూలు పెడతారో మన చెవిలో"

"సంబంధాలు చూస్తున్నారట."

"పెళ్ళికే? ఉద్యోగం సద్యోగం లేకుండా పెళ్ళిచేసి ఏం చేస్తాడట?"

"ఏమో మొన్న నీలవేణి ఆంటీ ఫోన్ చేసి మా కొచ్చే మంచి సంబంధాలన్నీ వీళ్ళు తీసుకెళ్ళిపోతున్నారు అని అమ్మతో చెప్పారట"

"ఏంటో జనాలు తీసుకెళ్ళడానికి బొమ్మలా? అయినా తీసుకెళ్ళినా చేసుకునేది ఒక్కళ్ళనేకదా. నువ్వు ఇక్కడికి వచ్చేసి మంచి పనిచేసావు. అక్కడే ఉంటే నువ్వు కూడా హరిత, నిఖిత, వర్షవాళ్ళలాగా చీరలు నగలు దగ్గర ఆగిపోయే దానివి. ఇప్పుడు నీకు ఎక్స్‌పోషర్ దొరుకుతుంది. దాన్ని యుటలైజ్ చేస్కో. నాకు తెలిసి అమెరికాకి వచ్చిన ఇండియన్ స్టూడెంట్స్ మెంటాలిటీలు రెండు. ఒకటి - అమెరికా వచ్చినా అమలాపురంలోలానే ఉంటారు. కేవలం ఇండియన్స్‌తోనే తిరుగుతారు. అమ్మాయిలు క్లాస్‌కి కూడా చుడీదార్ వేసుకుంటారు. బావిలో కప్పలానే ఉండిపోతారు. రెండో రకం - ఇండియన్స్‌తో మాట్లాడితే మహా పాపంలా ఫీల్ అవుతారు. కేవలం అమెరికెన్స్, లేదా వేరే దేశాల వాళ్ళతో మాత్రమే ఫ్రెండ్‌షిప్ చేస్తారు. ఇండియన్స్‌పట్ల చాలా జడ్జ్‌మెంటల్‌గా ఉంటారు. అలా కాకుండా నువ్వు నార్మల్‌గా ఉండు. కేవలం ఇండియన్స్ లేదా కేవలం ఫారినర్స్‌లాంటివి పెట్టుకోకు. మంచి వాళ్ళైతే ఎవరైనా ఒకటే. ఇలాంటి విష్యస్ సర్కిల్స్‌కి దూరంగా ఉండు. ఇంట్లో కంట్రోల్ చెయ్యడానికి అమ్మా నాన్న లేరని విచ్చలవిడిగా తయారవుతారు కొంతమంది. వాళ్ళకి చాలా దూరంగా ఉండు. నీకు నువ్వే కొన్ని రూల్స్ పెట్టుకుని వాటిని పాటించు. రాత్రి తొమ్మిది దాటాక బయటికి వెళ్ళకు. బట్టలు, మేకప్ అంటూ షోకులకి పోకు. రోజుకి కేవలం గంట మాత్రమే టీవీ చూడు. అన్నిటికన్నా ముఖ్యంగా కేంపస్‌లో జాబ్ తెచ్చుకో. కేఫెటీరియాలో పని చెయ్యాల్సొస్తే మొహమాటపడకు. ఇక్కడ ఎలాంటి జాబ్ అయినా డిగ్నిటీ ఆఫ్ లేబర్ ఉంటుంది. క్లాసులు మిస్ అవ్వకు. ఏరో స్పేస్ అన్నిటికన్నా కష్టం. జాగ్రత్తగా చదువుకో నువు వచ్చిన రీజన్ చదువుకోవడం మాత్రమే. అది మర్చిపోకు"

రెండు నిమిషాలకి "ఉన్నావా? నిద్రపోతున్నావా?" అడిగాడు.

"వింటున్నాను. నిద్రపోవట్లేదు"

"సర్లే ఇంక బోర్ కొట్టిచ్చను. రెడీ అవుతావా? కాసేపు బయట తిరిగి డిన్నర్‌కి వెళ్దాం."

"సరే" అని తయారవ్వడానికి వెళ్ళాను.

రెడీనా?" అన్నయ్య కేకవినబడింది.

"రెడీనే" అంటూ బయటకి జుట్టుదువ్వుతూ వచ్చాను.

రెండు నిమిషాలకి "ఎంతసేపే ఆ జుట్టు?" అడిగాడు.

"అయిపోవచ్చింది" అంటూ రబ్బర్ బాండ్ పెట్టి చెప్పులేసుకున్నాను.

"నీకు జుట్టు కట్ చెయ్యాలి" కారు ఎక్కుతూ అన్నాడు.

నేను చిన్నగా నవ్వడం గమనించి

"జోక్ కాదు. సీరియస్‌గానే. రోజూ ఇంతసేపు జళ్ళకైతే ఇంక అయినట్టే పని" సీరియస్‌గా అన్నాడు.

"అమ్మ తిడుతుంది" బిక్కుబిక్కుమంటూ చెప్పాను.

"అమ్మతో నేను మాట్లాడతా. నెక్స్ట్ వీక్ నీ హెయిర్ కట్‌కి వెళ్దాం."

"మరీ పొట్టిగా అయితే బావుండదేమో? "

"జుట్టు మళ్ళీ పెరుగుతుంది. కానీ టైం మళ్ళీ రాదు. నీకే అర్థమౌతుంది నేనేమంటున్నానో. యు విల్ థాంక్ మీ లేటర్"

ఇంత పొడుగు జుట్టుని కట్ చెయ్యాలా అని నిట్టూర్చాను. అది గమనించి "మరీ డిప్ప కటింగ్ చెయ్యించనులే. నువ్వే సెలెక్ట్ చేసుకో ఏది కావాలో. భుజం వరకు ఉంటే బెస్ట్. విరబోసుకుని వెళ్ళిపోవచ్చు. ముందుకి బేంగ్స్ పెట్టుకుంటే చిన్నపిల్లలా ఉంటావు."

అన్నయ్యకి అమ్మాయి హెయిర్ స్టైల్స్ ఎలా తెలుసు అని ఆశ్చర్యపోతూ తెలీకుండానే నిద్రలోకి జారుకున్నాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story